# కోవిడ్-19 వ్యాక్సిన్ - ఒక విశ్లేషణ

వరద

**కోవిడ్ 19** వ్యాధి కరోనాలో ఒక రకమైన వైరస్ ద్వారా జంతువులనుండి మనిషికి వచ్చి ఉండవచ్చు, లేదా ప్రయోగశాలలో తయారు చేసినటువంటి వైరస్ ద్వారా(బయోలాజికల్ వార్) ప్రపంచ రాజకీయ, ఆర్థిక విధానాలను శాసించడానికి గాని లేదా ప్రయోగశాలనుండి యాక్సిడెంటల్‌గా సమాజంలోకి వచ్చి ఉండాలి. 70 శాతం దాకా వైరస్ లేదా బాక్టీరియా ద్వారా వచ్చే కొత్త అంటువ్యాధులు పర్యావరణ విధ్వంసం వలన జంతువుల నుండి మానవులకు సంక్రమిస్తున్నాయి(జూనోసిస్).

కరోనా జాతికి చెందిన వైరస్ ద్వారా వచ్చిందే కోవిడ్ 19. ఇది చైనాలోని వ్యూహాన్‌లో మొదలయి ప్రపంచంలో కొత్తగా వచ్చిన వ్యాధి. వ్యాక్సిన్ లేదు. ఇంతవరకు దీనికి కొత్త మందు కనుగొనబడలేదు. AIDSకు వాడే రెమిడెస్విర్ (Remidesvir) మందును FDA(USA) వారు ఒక మందుగా అనుమతించారు. కొత్త మందు కనుగొనబడలేదు. టీకా కూడా కనుగొనే ప్రయత్నాలలో ఉన్నది.

ఏ రకమైన అంటు వ్యాధి నుండి అయినా సమాజం బయటపడాలంటే క్రింది వాటి ద్వారా సాధ్యమవుతుంది.

1. సరైన వ్యాక్సిన్ ద్వారా 2. సరైన మందుల ద్వారా వ్యాధిని నయం చేయుట 3. జబ్బును పూర్తిగా కంట్రోల్ చేయటం, తద్వారా వైరస్‌ను నియంత్రించడం 4. కొంత కాలం తర్వాత వైరస్ బలహీనపడి జబ్బు కలుగచేయలేకపోవటం 5. 60 శాతం పైగా ప్రజలు ఈ జబ్బు బారిన పడి కోలుకున్నవారు కోవిడ్ యాంటీబాడీస్ ఉన్నట్లు గుర్తించడం (సామాజిక వ్యాధి నిరోధక శక్తి – Herd immunity)

పై వాటి అన్నింటిలో ఉన్నతమైన వ్యాధి నిరోధక పద్ధతి వ్యాక్సిన్. మంచి వ్యాక్సిన్‌కు ఉండాల్సిన లక్షణాలు :

1. ఈ వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత ఎక్కువకాలం వ్యాధి నిరోధించబడాలి.
2. ఈ టీకా వాడటంవల్ల ఎలాంటి దుర్గుణాలు లేకుండా ఉండాలి (side effects).
3. కనీసం 70 శాతం ప్రజలను ఈ వ్యాధి నిరోధించగలగాలి.
4. అందరికీ అందుబాటులో ఉండాలి. ప్రభుత్వమే ఉచితంగా అందరికీ పంపిణీ చేయాలి.

వైరస్ వ్యాధిని తగ్గించే మందు లేదా వ్యాక్సిన్ తయారుచేయడానికి కొన్ని శాస్త్రీయ పద్ధతులు అనుసరించాలి.

1. తయారయిన వ్యాక్సిన్‌ను మొట్ట మొదటగా చిన్న చిన్న జంతువులపై ప్రయోగించాలి (చిట్టెలుకలు). కొద్దిపాటి వ్యాక్సిన్ డోసునుండి డోసు పెంచుకుంటూ పోవాలి.
2. మానవుల శరీర నిర్మాణానికి దగ్గరగా వున్న జంతువులపై ప్రయోగించాలి (ఉదా: కోతులు).
3. పరిమిత సంఖ్యలో ఆరోగ్యంగా ఉన్న వాలంటీర్లపై వ్యాక్సిన్ ప్రయోగించాలి. (సుమారుగా 20 నుంచి 40 మంది)
4. ఇది కొన్ని వందలమంది కరోనా రోగులపై ప్రయోగించాలి.
5. కనీసం 30 వేల నుంచి 40 వేల మంది పైగా ప్రజలపై ప్రయోగించాలి (సగం మందికి వ్యాక్సిన్, మిగిలిన సగం మందికి డిస్టిల్డ్ వాటర్ (distilled water)ను ఇంజెక్షన్ ద్వారా ఇవ్వాలి. ఈ రెండు గ్రూపులను పోల్చాలి).
6. అన్ని వయస్సులవారికి, అన్ని దశలలోను ఏ వయస్సు వారికి ఎంత డోసు ఇవ్వాలనేది నిర్ధారించాలి.

ఒకసారి ప్రజలకు వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాత 5 సంవత్సరాల వరకు దీని ముఖ్యలక్షణాలు పరిశీలించాలి. పైన పేర్కొన్న ముఖ్య లక్షణాలు లేనపుడు మార్కెట్‌నుండి (withdraw) ఉపసంహరించాలి (survailence period).

ఈ 6 దశలలోను వ్యాక్సిన్‌కు ఉండాల్సిన ముఖ్యలక్షణాలు అన్నీ సరిగా ఉండాలి. ఏ ఒక్కచోట సరైన ఫలితం లేకపోయిన ఎడల మళ్ళీ ఆ దశనుండి ప్రారంభించాలి.

ఇంతకుముందు ఇలాంటి వైరస్‌లకు వ్యాక్సిన్‌ను తయారుచేయటానికి 4 సంవత్సరాలు పట్టింది. కరోనా వ్యాధి తక్కువ కాలంలోనే ప్రపంచమంతా వ్యాపించింది. ఈ దశనే పాండమిక్ దశ అంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (W.H.O) దీనిని ఒక మెడికల్ యమర్జన్సీగా డిక్లేర్ చేసి వ్యాక్సిన్‌ను వీలయినంత త్వరగా (rapid) తయారుచేయడానికి అంగీకరించింది. ఈ దశలన్నీ పూర్తయిన తర్వాత రికార్డులన్నీ పరిశీలించి W.H.O సర్టిఫై చేయాలి. అపుడే అది మార్కెట్‌లోకి విడుదల చేయాలి.

ఇప్పటివరకు వివిధ దేశాలలో సుమారుగా 150 ప్రయోగశాలల్లో వ్యాక్సిన్ తయారు చేయడానికి ప్రయత్నం జరుగుతోంది. చైనాలో 7 ప్రయోగ శాలలు, అమెరికాలో సుమారుగా 20కి పైగా ప్రయోగశాలలు, బిల్‌గేట్స్ లాంటి ధనవంతులు ఒక్కరే సుమారుగా 7 పరిశోధనా కేంద్రాలలో వ్యాక్సిన్ తయారు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. వివిధ దేశాలలో ఎక్కువ ప్రయోగశాలల్లో తయారు చేయడానికి ప్రయత్నించడానికి మూల కారణం– ముందుగా తయారుచేసి మార్కెట్‌లోకి వచ్చి అధికలాభాలను పొందడానికే. పేటెంట్ హక్కు అవసరం లేదని W.H.O ప్రకటించడంవల్ల బహుళజాతి కంపెనీలు, పెద్ద ఫార్మా కంపెనీలు, బాగా డబ్బున్న బిల్‌గేట్స్ లాంటి వారు ఈ రంగంలో ఉన్నారు. అందరి లక్ష్యం ముందుగా వ్యాక్సిన్‌ను తీసుకువచ్చి అధిక లాభాలను పొందడమే తప్ప ప్రజల ఆరోగ్యం గురించి కాదు.

ఉదా: ఇది ప్రయోగశాలలో తయారుచేయబడ్డ వైరస్ అయ్యుంటే దీనికి వ్యాక్సిన్ తయారు చేయలేము(ఉదా: ఎయిడ్స్).

ఎయిడ్స్‌తో 30 సంవత్సరాల నుండి సుమారుగా 3 1/2 కోట్ల మంది చనిపోయారు. ఈ వ్యాధి సంక్రమించిన తర్వాత బ్రతికినంత కాలం మందులు ఉపయోగించాలి. ల్యాబ్‌లో తయారయిన వైరస్ అవ్వడం వలన ఎయిడ్స్‌కు వ్యాక్సిన్ లేదు. రోగ నిరోధకశక్తి తగ్గటం వలన ఇతర జబ్బులు కూడా తేలికగా వచ్చి వాటి మందులు కూడా వాడాల్సిన అవసరమేర్పడింది. మనిషి శారీరకంగా బలహీనపడి తద్వారా దేశ ఆర్థికవ్యవస్థ కూడా దెబ్బ తింటుంది. బహుళజాతి కంపెనీలు, దేశాలు తాము లాభపడి ఇతర శత్రుదేశాలను ఆర్థికంగా, ఆరోగ్యరీత్యా దెబ్బతీయటం ఈ వైరస్‌లను వ్యాపింపచేసే వారి లక్ష్యం. కరోనా వైరస్ కూడా ల్యాబ్‌లో తయారయి ఉంటే ఇదే పరిస్థితి ఏర్పడుతుంది. 2020 అక్టోబరు నెల వరకు కరోనా వైరస్‌తో ప్రపంచంలో 4 కోట్ల మందికి పైగా ప్రజలు జబ్బున బారిపడ్డారు. 11 లక్షలమందికి పైగా ప్రజలు చనిపోయారు. సుమారుగా 20 శాతం నుండి 30 శాతం రోగ బాధితులలో ఏదో ఒక రకమైన దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో (ఊపిరితిత్తులు, రక్తనాళాలు, కిడ్నీలు, లివర్, నాడీవ్యవస్థ) బాధ పడుతున్నారు. 2008లో SARS(కరోనా వైరస్) వ్యాధి వచ్చినపుడు వ్యాక్సిన్ తయారుచేయడానికి ప్రయత్నించారు. వ్యాక్సిన్ తయారుచేసే క్రమంలో ఈ వ్యాధి పూర్తిగా తగ్గిపోయింది. దానితో వ్యాక్సిన్ తయారు చేయడం నిలిపివేశారు.

ప్రపంచవ్యాప్తంగా సుమారుగా 9 కంపెనీ లలో మానవులపై వ్యాక్సిన్‌ను ప్రయోగించే వివిధ దశలలో ఉన్నారు. సుమారుగా సెప్టెంబరు 15న అమెరికాలోని మయినార్ అనే కంపెనీ 2 నెలల్లో వ్యాక్సిన్ తయారుచేస్తామని, డోస్ సుమారుగా రు.1000 ఉంటుందని చెప్పారు. అమిత లాభాలకోసం త్వరగా మార్కెట్‌లోకి రావాలని శాస్త్రీయ ప్రమాణాలు గాలికొదిలి వ్యాక్సిన్‌ను, మందులను తయారు చేయటంలో అన్ని ప్రయోగశాలలు పోటీ పడుతున్నారు. చైనా, అమెరికా, రష్యా, ఇంగ్లాండు, జర్మనీలలోని 5 కంపెనీలు పోటీలుపడి

మా వ్యాక్సిన్ వస్తుందంటే మాది ముందు వస్తుందని ప్రకటనలు చేస్తున్నారు. ఇప్పటివరకు నిర్ధారణగా ఏ ఒక్క కంపెనీ మూడవదశలో మానవ ప్రయోగాలు జరిపినట్లు లేదు. ఇవన్నీ ప్రజలను మోసగించడానికి చేస్తున్న వ్యాపార ప్రకటనలు మాత్రమే.

ఈ వ్యాక్సిన్ గురించి మాట్లాడటానికి ట్రంప్, మోదీ, పుతిన్, జిన్‌పింగ్‌లకు ఉన్న శాస్త్రీయ అర్హతలు ఏమిటి? దీనిపై పూర్తిగా వివరణ ఇవ్వాల్సింది ప్రయోగశాలల్లో పనిచేస్తున్న శాస్త్రజ్ఞులు, డాక్టర్లు, ఈ పనిలో నిమగ్నమయిన వారు మాత్రమే అర్హులు. ట్రంప్ 4 నెలలనాడే అమెరికా ఎన్నికల నాటికి వ్యాక్సిన్ వచ్చేస్తుందని, అందరికీ ఈ వ్యాక్సిన్ అందుబాటులోకి తెస్తానని ప్రకటన చేసారు. మన ప్రధానమంత్రి మోదీ గారు ఆగస్టు 15 నాటికి వ్యాక్సిన్ తయారవుతుందని దేశ ప్రజలందరికీ ఉచితంగా వ్యాక్సిన్ ఇవ్వగలుగుతామని ప్రకటన చేసారు. మూడవ దశవరకు ప్రయోగాలు పూర్తయ్యాయని 2 నెలల క్రితమే రష్యా ప్రధాని పుతిన్ W.H.O కు సర్టిఫికెట్ కోసం పంపించారు. మానవులపై మూడవదశ ప్రయోగాలు 30 వేల నుంచి 40 వేల వరకు చేసి మరలా సర్టిఫికెట్ కోసం రావాల్సిందిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (W.H.O) సలహా ఇచ్చింది. చైనాలో కూడా ఇదే పరిస్థితి.

### అసలు విషయం ఏమిటి?

ఇపుడు గమనించాల్సిన ముఖ్య అంశం జరుగుతున్న ఎన్నికలపై నాయకుల ప్రకటనలు ఓటర్లను ప్రభావితం చేస్తాయి. ఎన్నికలలో గెలవడమే వారి ప్రకటనల ఉద్దేశ్యం. ఇపుడు బీహార్, తమిళనాడు తదితర రాష్ట్రాలలో జరుగుతున్న ఎన్నికలలో మోడీగారు డిసెంబరు నాటికల్లా వ్యాక్సిన్‌ను పూర్తిగా ఉచితంగా ఇస్తామనే వాగ్దానం మొదలుపెట్టారు. ఇది ఒక ఎన్నికల స్టంట్ మాత్రమే. గౌరవనీయులు మన ప్రధానమంత్రి మోడీగారు బీహార్ ఎన్నికల సభలో ప్రకటన చేసిన తర్వాత మూడు రోజులకు హైదరాబాద్‌లోని CCMB డైరెక్టర్ ఇంత త్వరగా వ్యాక్సిన్‌ను తీసుకురావడం శాస్త్రీయంగా సాధ్యం అయ్యే పనికాదని ప్రకటన చేశారు. వివిధ దేశాలలోని శాస్త్రజ్ఞులు, డాక్టర్లు సుమారుగా మార్చి 2021కు వ్యాక్సిన్ రావచ్చునని, ఆపైన ప్రపంచంలో ఈ వ్యాక్సిన్‌ను అందరికీ ఇవ్వడానికి 1సం॥ నుంచి 2సం॥లు పడుతుందని చెప్పారు. ఇండియాలో వ్యాక్సిన్‌ను తయారుచేసే భారత్ బయోటెక్ అనే కంపెనీ ఇదే విషయాన్ని చెప్పింది. ఇదే W.H.O కూడా ధృవపరిచింది. పుతిన్ ఈ వ్యాక్సిన్‌ను మేము తయారుచేసాము, మా దేశ ప్రజలకు ఇచ్చుకుంటాము అని ప్రకటించాడు. మన దేశంలోని సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాకు 2 కోట్ల వ్యాక్సిన్ డోసులు ఆర్డరు ఇచ్చాడు.

W.H.O నుండి అమెరికా బయటకు వచ్చినట్లు 4 నెలల క్రితం ప్రకటించింది. రష్యా, చైనాలు కూడా అదే బాటలో ఉన్నాయి. ప్రపంచ సంస్థలన్నింటిని తన కనుసన్నలలో పనిచేసేటట్లు చేయటం, లేకపోతే ఆ సంస్థలను నిర్వీర్యం చేయటం అమెరికా లక్ష్యం. దీనితో W.H.O బలహీనపడింది.

### వ్యాక్సిన్-దీనికి సంబంధించిన రాజకీయ, ఆర్థిక అంశాలు

ప్రపంచంలో ఏ రకమైన ఉత్పత్తులు కొత్తగా వచ్చినా పెట్టుబడిదారీ దేశాల ప్రధాన లక్ష్యం డబ్బు సంపాదించడం. వారికి అనుకూలంగా లేని వివిధ దేశాలలో ఆర్థిక మూలాలను దెబ్బతీయటం, తద్వారా విపరీత మయినటువంటి దోపిడీ చేయడం వారి ఉద్దేశ్యం. ఈనాడు వీరు అడ్వాన్సుగా డబ్బు తీసుకుని వ్యాక్సిన్ వస్తే ఇన్ని కోట్ల డోసులు ఇస్తామనే అగ్రిమెంట్లు వ్రాయించుకోవడం మొదలుపెట్టారు (ఉదా: ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ – ఆస్ట్రాజెనిక కంపెనీ). ఇప్పటివరకు కొన్ని దేశాలలో అగ్రిమెంటు చేసుకొని డబ్బులు తీసుకున్న సందర్భాలు ఉన్నాయి. జర్మనీలో ఫైజర్ (Pfizer) కంపెనీ, జర్మన్ ప్రభుత్వం కలిపి ఇదే తరహాలో అగ్రిమెంట్లు చేసుకున్నాయి. మన దేశంలో సుమారుగా 3 కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ప్రపంచంలోని వివిధ దేశాల వారు మన దేశంలోని కంపెనీలకు వారి మందు కనుగొన్న వెంటనే ఇన్ని కోట్ల డోసులు కావాలని అగ్రిమెంటు చేసుకొంటున్నారు. ఆయా దేశాలలో మందు తయారయినప్పటికీ ప్రపంచమంతా పంపిణీ చేసే వ్యాక్సిన్‌లలో 60 శాతం మన దేశంలోనే తయారవుతాయి. సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (పూనేవాలా కంపెనీ) వ్యాక్సిన్ తయారు చేయడంలో అందరికంటే ముందున్నారు. అమెరికాలో ఒకడోసు 250 నుండి 400 డాలర్లవరకు ఖరీదవుతుందని (రు.18000 నుండి రు.30000 వరకు), ఇండియాలో మొదట్లో రు.1000 అని చెప్పి ఇపుడు రు.3000 వరకు ఉండవచ్చుని చెబుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీహార్ ప్రజలందరికీ కోవిడ్ వ్యాక్సిన్ పూర్తిగా ఉచితంగా ఇస్తానని, వ్యాక్సిన్ ఇవ్వడానికి 50 వేల కోట్ల రూపాయలు సిద్ధంగా ఉన్నాయని మోడీ వాగ్దానాలు చేస్తున్నారు. మన దేశ ప్రజలందరికీ వ్యాక్సిన్ ఉచితంగా ఇవ్వాలంటే కనీసం 2 1/2 లక్షల కోట్ల నుండి 3 లక్షల కోట్ల రూపాయలు కావాలి.

మన దేశంలో మొట్టమొదటి కోవిడ్ కేసు జనవరి 31న కేరళలో నమోదయింది. ఆ తర్వాత కొద్ది రోజులకే వివిధ రాష్ట్రాలలో కేసులు ఎక్కువగా నమోదవటం మొదలయ్యింది. విదేశీయులు ఎక్కువగా వచ్చే ఢిల్లీ, ముంబయి, చెన్నైలలో చాలా త్వరగా రోగులసంఖ్య పెరగటం మొదలయింది. ఇంత జరుగుతున్నా దేశ, విదేశీ ప్రయాణీకులను, ఇతర రవాణా సౌకర్యాల ద్వారా వచ్చే ప్రయాణీకులను భారత ప్రభుత్వం నియంత్రించలేదు. కనీస జాగ్రత్తలు కూడా తీసుకోలేదు. ఫిబ్రవరి నెలలో ట్రంప్ మనదేశ పర్యటనకు రావడం, అహ్మదాబాద్‌లోని ఆ బహిరంగసభకు లక్షల మందిని పోగేయటం జరిగింది. తద్వారా కరోనా వ్యాప్తి అటు గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లోను ఎక్కువగా జరిగింది. ఆ తరువాత పార్లమెంటు సమావేశాలు మొదలయ్యాయి. ఈ సమయంలోనే వివిధ దేశాలలో, ఖండాలలో ఇది వ్యాపించింది. ఇది పాండమిక్ దశ అని మెడికల్ యమర్జన్సీగా W.H.O ప్రకటించింది. వియత్నాం లాంటి కొన్ని దేశాలు నేషనల్ ఎమర్జన్సీని ప్రకటించి కోవిడ్‌ను నియంత్రించగలిగాయి. విదేశాలనుంచి వచ్చిన వారిని 21 రోజులు క్వారంటైన్‌లో ఉంచి, 25 రోజుల తర్వాత విదేశీ విమానాలన్నీ వియత్నాం రద్దు చేసింది. మన దేశంలో W.H.O మెడికల్ ఎమర్జన్సీగా డిక్లేర్ చేసినా ఎలాంటి జాగ్రత్తలు పాటించలేదు. పార్లమెంటు సభలు ముగిసిన కొద్ది రోజులకే మన ప్రధానమంత్రి మోడీగారు రాత్రి 8 గంటలకు ప్రకటన చేస్తూ అదే రోజు రాత్రి 12 గం॥లనుండి లాక్‌డౌన్‌ను ప్రకటించారు. అప్పటికే వివిధ రాష్ట్రాలలో సుమారుగా 70 వేల మంది ప్రజలు ఈ వ్యాధి బారిన పడ్డారు.

### కోవిడ్‌తో పతనమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ :

లాక్‌డౌన్ ప్రకటించిన సమయంలో మన దేశంలో, ప్రపంచవ్యాప్తంగా అన్నిరకాల పరిశ్రమలు పాక్షికంగా మూతపడ్డాయి. సాఫ్ట్‌వేర్ కంపెనీల ఉద్యోగులు ఇంటి దగ్గర నుంచి పని చేయడానికి అవకాశం ఇచ్చాయి. పరిశ్రమలు 80 శాతం దాకా మూతపడ్డాయి. ఆటోమొబైల్ పరిశ్రమ, గృహనిర్మాణ పరిశ్రమ, ట్రాన్స్‌పోర్టేషన్, టూరిజం, హోటళ్ళు, రెస్టారెంట్లు, విమానాలు, రైళ్ళు పూర్తిగా నిలిపివేయబడ్డాయి. కాలేజీలు, విద్యాసంస్థలన్నీ పూర్తిగా మూతపడ్డాయి. వ్యవసాయరంగం తప్ప మిగతా రంగాలన్నీ పూర్తిగా స్తంభించిపోయాయి. దీనితో నిరుద్యోగం లేదా పాక్షికమైన ఉద్యోగాలు వచ్చాయి. ప్రభుత్వోద్యోగులందరికి జీతం సగం తగ్గించి ఇచ్చారు. ప్రైవేటు సెక్టర్‌లోని ఉద్యోగులను తీసివేయడం లేదా సగం జీతాలు ఇవ్వడం జరిగింది. భౌతిక దూరం పాటించి శానిటైజర్లు, మాస్కులు, పి.పి.ఇ.కిట్లు వాడితే ఈ జబ్బు నుంచి రక్షించుకోవచ్చని మొదట్లో ప్రచారం జరిగింది. 60 శాతం ఆల్కహాల్‌తో ఉన్న శానిటైజర్‌తోను, సబ్బులతోను చేతులు కడుక్కుంటే వైరస్ సోకదని ప్రధానమంత్రి నుంచి సినిమా నటుల వరకు ప్రచారం గావించారు. దీనితో కంపెనీలు వివిధ రకాల పేర్లతో శానిటైజర్లు, మాస్కులు తయారుచేసి మార్కెట్లను ముంచెత్తారు. వాళ్ళకు ఇష్టమొచ్చిన రేట్లకు, విపరీతమైన లాభాలకు (డిమాండ్&సప్లై) పెట్టుబడిదారులు వీటిని అమ్మి ప్రజలను లక్షల కోట్ల రూపాయల దోపిడీ చేశారు.

వైరస్ వచ్చిన మొదటి వారంలో 1. టామీ ఫ్లూ టాబ్లెట్లు 2. పారాసెటమాల్ టాబ్లెట్లు 3. యజిత్రోమైసిన్ టాబ్లెట్లు 4. హైడ్రాక్సీ క్లోరోక్విన్

టాబ్లెట్లు 5. జింక్ టాబ్లెట్లు 6. విటమిన్ సి టాబ్లెట్లు 7. విటమిన్ డి3 టాబ్లెట్లు 8.ఫెమోటిడిన్ (Femotidine) వాడమని ప్రచారం చేశారు. వీటితో పాటుగా రోగనిరోధక శక్తిని పెంచడానికని ఆయుర్వేదం నుంచి అల్లోపతిదాకా అశాస్త్రీయమైనటువంటి రకరకాల టానిక్‌లు, కషాయాలు, ఇంజక్షన్‌లు, టాబ్లెట్స్ ప్రచారం గావించబడ్డాయి. వీటితో పాటు పారాసెటామ్ల్, క్లోరోక్విన్, ఫెమిటెడిన్‌లు జబ్బు రాకుండా నియంత్రించే మందులుగా ప్రచారం చేశారు. డబ్బులున్నవారు పెద్ద ఎత్తున వీటిని కొని ఇళ్ళలో దాచుకున్నారు. దీనితో మార్కెట్‌లో ఈ మందులు దొరకని పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి పై మందులేవీ ముందుగా కరోనా వ్యాధి రాకుండా నియంత్రించలేవు. ఈ మందులు పూర్తిగా అయిపోయి ఎప్పటినుంచో ఉన్న స్టాకులన్నీ క్లియర్ అయ్యాయి. మన దేశం నుంచి క్లోరోక్విన్ (HCQS) మందు 100కు పైగా దేశాలకు సప్లై చేశాము. మలేరియాకు వాడే ఈ మందు ప్రస్తుతం మలేరియా ఉధృతంగా లేని ఈ దశలో వివిధ దేశాలలో ఉన్న స్టాకులన్నీ క్లియర్ అయ్యాయి. కొంత బ్లాక్‌లో కూడా ఈ మందులు అమ్మారు. ఈ ప్రక్రియలో లక్షల కోట్ల రూపాయల దోపిడీ జరిగింది.

కరోనా వచ్చిన తర్వాత కూడా మొదటి దశలో టామీఫ్లూ,యజిత్రోమైసిన్, పారాసెటామ్ల్, దగ్గుమందులు, వివిధ రకాలైన యాంటీవైరస్ మందులు వాడమని సలహా ఇచ్చి కొన్ని వారాల తర్వాత ఇవి పనిచేయడంలేదని వారే డిక్లేర్ చేశారు. ఈ దశలోనే ఇంగ్లాండు నుండి డెక్సామితజోన్ ఇంజక్షన్‌లు, టాబ్లెట్లు వాడటం వలన ఈ జబ్బు త్వరగా తగ్గిపోతుందని సలహా ఇచ్చి ప్రచారం చేశారు. అపుడే ఆక్సిజన్ సపోర్టుతో నెబొలైజేషన్ ద్వారా మందులను (స్ప్రే మందు) వాడటం మొదలుపెట్టారు. సి-పాప్స్, బై-పాప్స్ కూడా వెంటిలేటర్లకు ప్రత్యామ్నాయమనే మాట ముందుకు రావడంతో వాటికి డిమాండ్ పెరిగింది. మెకానికల్ (నాన్ ఇన్వెజబుల్, ఇన్వేజబుల్) వెంటిలేటర్లు దొరకని పరిస్థితి. యాంటీవైరల్ మందుల కొరత, ఆక్సిజన్ కొరత, నెబ్యులైజేషన్  పరికరాల కొరత ఏర్పడి విపరీతమైన ధరలకు కొనాల్సిన అవసరమొచ్చింది. వీటి మీద లక్షలకోట్ల రూపాయల దోపిడీ జరిగింది.

కోవిడ్ మొదటి దశలో ప్రభుత్వ ఆసుపత్రులలో మాత్రమే పేషెంట్లను చేర్చుకోవటం జరిగింది. కేసుల సంఖ్య విపరీతంగా పెరగటంతో ప్రైవేటు మెడికల్ కాలేజీలలోను, పెద్ద ప్రైవేటు హాస్పటల్స్-పెద్ద హోటల్స్ సమన్వయంతో బెడ్ల సంఖ్యను పెంచారు. కావలసిన డాక్టర్లను, స్టాఫ్‌ను సమకూర్చకుండా ఒక స్టేడియంను కూడా 2500 బెడ్స్‌తో కోవిడ్ హాస్పిటల్‌గా తెలంగాణా ప్రభుత్వం మార్చి వేసింది. రెవిన్యూ డివిజన్ హాస్పటల్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను అన్నింటినీ క్వారంటైన్ ఆసుపత్రుల క్రింద మార్చివేశారు. ఈ సంక్షోభ సమయంలోనే హాస్పటల్స్‌లో స్టాఫ్, బెడ్లు లేక పెద్ద హోటళ్ళలో కొన్నింటిని పెయిడ్ క్వారంటైన్ సెంటర్లుగా మార్చారు. వీటన్నింటిలో ప్రభుత్వమే వైద్యం చేయలేక ప్రజారోగ్యవ్యవస్థ పూర్తిగా చేతులెత్తేసింది. ఈ  దశలోనే కరోనా పేషెంట్లకు వైద్యం చేయడానికి పెద్ద ప్రైవేటు హాస్పిటల్స్‌కు కూడా పర్మిషన్ ఇవ్వడం జరిగింది. వైద్యానికి కొన్ని రేట్లు కూడా నిర్ణయించినా ఏ ప్రైవేటు హాస్పిటల్‌లోనూ దీనిని అమలు పరచలేదు. ఈ దశలోనే ఎయిడ్స్‌కు వాడే రెమిడెస్విర్ (Remidesivir) మందు కొంతవరకు పనిచేస్తున్నట్లు కనుగొన్నారు. దీనిని అక్టోబరు 20న FDA(USA) కరోనాకు మందుగా గుర్తించింది. దీనిని ఇండియాలో మూడు కంపెనీలకు తయారు చేయడానికి పర్మిషన్ ఇచ్చారు. చికిత్సకు అన్ని డోసులకు(5 ఇంజక్షన్‌లు) కలిపి 33 వేల నుండి 36 వేల రూపాయలుగా I.C.M.R. డ్రగ్ కంట్రోల్ ఆఫ్ ఇండియా వారు నిర్ణయించారు (fix). ఈ మందు పనిచేస్తుందని ప్రచారంలో ఉన్న కొత్తలో కోర్సు అంతా 3 లక్షలనుంచి 3 1/2 లక్షల రూపాయల వరకు బ్లాకులో అమ్మటం మొదలు పెట్టారు. ప్రతి దశలోనూ అన్ని రకాలయిన పరికరాలు, అన్ని రకాల మందులను జాతీయ, బహుళజాతి  కంపెనీలు  విపరీతమైన రేట్లకు బ్లాకులోనూ, ప్రభుత్వం ద్వారాను అమ్మాయి. దీనికి ఎన్ని లక్షల కోట్ల రూపాయలను దోచుకున్నారనేది చెప్పటం కష్టం.

ప్రైవేటు హాస్పిటల్స్ బెడ్ల కృత్రిమమైన కొరతను సృష్టించాయి. దీనితో డబ్బున్న వారు పెద్ద హాస్పిటల్స్‌లో రూములను రిజర్వు చేసుకున్నారు. 2 లేదా 3 లక్షల రూపాయలు అడ్వాన్సుగా డబ్బు కట్టిన వారికి ఖాళీ అయిన తర్వాత రెండు, మూడు రోజుల్లో హాస్పిటల్‌లో బెడ్ కేటాయిస్తామని చెప్పటం జరిగింది. స్థానిక రాజకీయ నాయకులు లంచాలు తీసుకొని రికమెండ్ చేసిన వారికి హాస్పిటల్స్‌లో బెడ్స్‌ను వెంటనే ఇవ్వడం జరిగింది. ప్రైవేటు హాస్పిటల్స్‌లో దాదాపు అన్నింటిలోను రెండు, మూడు రోజులు హాస్పిటల్‌లో ఉంచితే 2 నుంచి 3 లక్షల రూపాయలు బిల్ వేసారు. ఆక్సిజన్ ఇచ్చి మిగిలిన పరీక్షలు, మందులు వాడే దశలో 15 నుంచి 20 లక్షల రూపాయల వరకు చార్జి చేసారు. వెంటిలేటర్లు, సి-పాప్స్, బై-పాప్స్ వాడి 15 రోజుల వరకు హాస్పిటల్‌లో ఉంటే 20 లక్షల నుంచి 40 లక్షల రూపాయల వరకు దోపిడీ చేసారు. ప్రభుత్వానికి ఈ విషయంపై కంప్లైంట్ చేస్తే 2 లేదా 3 ప్రైవేటు హాస్పిటల్స్‌ను మాత్రమే కొవిడ్ హాస్పిటల్స్ లిస్టు నుండి తొలగించారు.

క్వారంటైన్ (హోటల్స్) హాస్పిటల్స్‌లో ఒక్కొక్క బెడ్‌కు రోజుకు 20 వేల నుంచి 40 వేల రూపాయలు చార్జి చేసారు. ఈ దశలో పర్మిషన్ లేని ప్రైవేటు హాస్పిటల్స్ వారు కూడా కరోనాకు ట్రీట్‌మెంట్ ఇస్తూ దోపిడీ చేయడం మొదలుపెట్టారు. చివరకు చిన్న సెంటర్లలో కూడా R.M.P, P.M.Pలు వైద్యం ప్రారంభించి రోజుకు 40 వేల నుంచి 50 వేల రూపాయల వరకు దోపిడీ  చేసారు. పల్స్ ఆక్సీమీటరును ఉపయోగించి రోగిని పరిశీలించి (observe) అత్యవసర పరిస్థితి ఏర్పడితే తనకు సంబంధించిన ప్రైవేటు హాస్పిటల్‌కు ఈ R.M.P, P.M.P డాక్టర్లు పంపించారు. ఈ విధంగా బెడ్ల కొరతను, వ్యాధి గురించి చికిత్స విషయాలు తెలియకపోవడం వల్ల, ప్రజల ఆదుర్దాను ఆసరా చేసుకొని వేల లక్షల కోట్ల రూపాయలను దోపిడీ చేసారు. చివరకు రోగి చనిపోయినా కూడా ఈ దోపిడీ ఆగలేదు. పూర్తిగా బిల్ చెల్లిస్తేగాని శవాన్ని బంధువులకు అప్పజెప్పలేదు. చనిపోయిన శవాన్ని తరలించే వారు కూడా దొరకక అక్కడకూడా లంచం ఇస్తేగాని శవాన్ని బయటకు తీసుకుని రాలేని పరిస్థితి. అన్ని దశలలోనూ వేలల్లో చెల్లిస్తే గాని  శవాన్ని అప్పచెప్పలేదు. శవాన్ని తీసుకువెళ్ళడానికి కావాల్సిన వాహనాలు సరిగా లేక రోగులను జె.సి.బి.ల మీద, ట్రాక్టర్లమీద, అన్ని రకాల వాహనాల మీద తీసుకెళ్ళి పూడ్చివేయడం సర్వసాధారణమయ్యింది. ఈ క్రమంలో కొద్ది మంది తమ బంధువుల శవాలను హాస్పిటల్స్‌లో వదిలివెళ్ళిన పరిస్థితి ఉంది. ఇవన్నీ పరిశీలిస్తే రోగి బ్రతికినా, చనిపోయినా నిలువుదోపిడీ మాత్రం ఆగలేదు.

అక్టోబరు 29 నాడు ఆస్ట్రాజనిక కంపెనీ వారి రిప్రజెంటేటివ్ వీరి వాక్సిన్ రెండు, మూడు వారాల్లో మార్కెట్‌లోకి విడుదల చేస్తామని, డిసెంబరు చివరి నాటికి ఉత్పత్తి పెంచి వివిధ దేశాలకు సప్లై చేయగల దశలో ఉన్నామని, ప్రపంచ ప్రజలందరికీ వ్యాక్సిన్ వేయడానికి కనీసం 2 సం॥లు పడుతుందని ప్రకటించారు. ఇది వారు చెప్పే అంచనా. ఇప్పటి వరకు మూడవదశ (మనుషులపై ట్రయిల్స్) పూర్తి అయినట్లు సమాచారం లేదు. W.H.O సర్టిఫై చేసినట్లు కూడా వివరించలేదు.

వ్యాక్సిన్‌ను 6 లేదా 7 రకాలుగా తయారు చేయవచ్చు. రకరకాల పద్ధతులలో వైరస్‌లోని భాగాలను వాడి తయారుచేస్తారు. కండరానికి లేదా చర్మం క్రింద ఇంజక్షన్ చేయడం ద్వారా, ముక్కుకు స్ప్రే చేయడం ద్వారా, నోటిలో చుక్కలు వేయడం ద్వారా ఈ వ్యాక్సిన్‌ను ఇవ్వవచ్చు. ఇంతవరకు ఏ వ్యాక్సిన్ పూర్తిగా ఎంత వరకు పనిచేస్తుంది, ఎంత కాలం పనిచేస్తుంది, ఎంత శాతం ప్రజలలో జబ్బు రాకుండా నియంత్రించగలదు, దుర్గుణాలు (side effects) లేకుండా ఉండగలదో ఎవరూ చెప్పలేని దశ. ఇప్పుడు పనిచేస్తున్న శాస్త్రజ్ఞులంతా సుమారుగా 6 నెలల వరకు వ్యాక్సిన్ పనిచేసినా పరవాలేదనే ఆలోచనలో ఉన్నారు. 6 నెలలపాటు దీనిని నిరోధించగలిగితే ఇపుడున్న వైరస్ సైకిల్ బ్రేక్ అవ్వడం లేదా Herd immunity (60 శాతం పైగా ప్రజలకు యాంటీ బాడీస్ కలిగివుండటం) వల్ల ఈ జబ్బును పూర్తిగా నియంత్రించగలమనే అంచనాలో ఉన్నారు.

ప్రజారోగ్య వ్యవస్థలోని అన్ని అంగాలు (మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీలు, అన్ని హాస్పిటల్స్, మందులు–పరికరాలు తయారుచేసే కేంద్రాలు) ప్రభుత్వరంగంలో ఉంటేనే ఇలాంటి విపత్కర పరిస్థితిని సమర్థంగా ఎదుర్కోగలం. ప్రజలను జబ్బుల బారినుండి రక్షించగలం. ప్రభుత్వమే అన్ని జబ్బులకు, అన్ని దశలలో ఉచితంగా వైద్య సదుపాయాలు అందించాలి. ప్రజారోగ్య వ్యవస్థ ప్రభుత్వాల చేతిలో ఉన్న క్యూబా, వియత్నాం దేశాల అనుభవం ఈ విషయాన్నే రుజువుచేసింది. ఆరోగ్యం ప్రజల ప్రాథమిక హక్కుగా ఉన్నపుడే ఇది సాధ్యం. బహుశా ఇపుడున్న కొన్ని సోషలిస్టు దేశాలలోను, ప్రజారోగ్య వ్యవస్థ మొత్తం ప్రభుత్వ చేతుల్లో ఉన్న కొన్ని పెట్టుబడిదారీ దేశాలలోను (న్యూజిలాండ్, యు.కె., ఫ్రాన్స్ మొ॥ దేశాలలో) ఇది సాధ్యమయింది. కోవిడ్ లాంటి వైరస్‌లు రాకుండా నియంత్రించడానికి, వచ్చిన తర్వాత వ్యాప్తి చెందకుండా ఉండాలంటే ప్రజారోగ్య వ్యవస్థ మొత్తం ప్రభుత్వం చేతుల్లో ఉండాల్సిన అవసరం ఈ వైరస్ ద్వారా ప్రపంచానికి తెలిసింది. యూరప్ దేశాలలో కరోనా రెండవ వేవ్‌లో ఉన్నది. రెండవ దశలో ఒక్క అమెరికాలోనే నవంబరు 1వ తేదీకి రోజుకు 30,000 నుంచి 1లక్ష వరకు కేసులు పెరిగాయి. యూరప్ దేశాలలో కరోనా అవతారం మార్చుకుందని (Mutation) అంటున్నారు. ఇప్పటివరకు కనుగొన్న వ్యాక్సిన్ మ్యుటేషన్ చెందిన వైరస్‌పై ఎంతవరకు పనిచేస్తుంది అనేది అనుమానమే.

**కరోనా రాజకీయాలు :**

అమెరికాలోని హ్యూస్టన్ పట్టణంలో జరిగిన బహిరంగసభలో ప్రవాస భారతీయులందరూ ట్రంప్‌కే ఓటేయమని మోదీ బహిరంగ విజ్ఞప్తి చేసారు. ఒక దేశ ప్రధాని అమెరికా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి ఓటేయమని బహిరంగంగా ప్రచారం చేయడం ప్రపంచ చరిత్రలోనే మొదటిసారి. ఇరు దేశాలకు ఉన్నటువంటి రక్షణ, ఆర్థిక ఒప్పందాల పర్యవసానమే ఈ ప్రచారం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. అమెరికా యొక్క FDI వల్ల అన్ని శాఖలలో చివరకు రక్షణశాఖ రహస్యాలతో సహా అమెరికా వాడి చేతిలో పెట్టడం జరిగింది. దీని మూలంగానే హైడ్రాక్సీ క్లోరోక్విన్ టాబ్లెట్లు పంపించడం కొంత ఆలస్యం జరగగానే ట్రంప్ మన ప్రభుత్వాన్ని హెచ్చరించడం వలన మోడీ వెంటనే పంపించివేశాడు. దీన్ని బట్టి మనదేశం అమెరికా కనుసన్నల్లో పనిచేస్తూ వారి రాజకీయ వత్తిడి కింద ఎంత ఉందో అర్థమవుతుంది.

**ట్రంప్ రాజకీయ నాటకం**

తనకు కరోనా వచ్చిందని ప్రకటించి అమెరికన్ మిలటరీ హాస్పిటల్‌లో చేరి మూడవరోజునే నాకు కరోనా తగ్గిపోయిందని చెప్పి ట్రంప్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. ఇప్పుడున్న శాస్త్రీయ అవగాహన ప్రకారం 48 గంటలలోపే పాజిటివ్ నుంచి నెగెటివ్‌గా రావటం అసాధ్యం. అమెరికాలోని ప్రముఖ డాక్టర్లు దీనిని ఖండిస్తూ కనీసం మూడు వారాల వరకు వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకోవాల్సిన అవసరముందని ట్రంప్‌కు సలహా ఇవ్వడం జరిగింది. టీ.వి.లలోగాని, బయటగానీ ఏరోజూనా ట్రంప్ మాస్కు ధరించడం మనం చూడలేదు. మాస్కు అక్కరలేదని, ఉపయోగం లేదనీ తనే ప్రచారం చేసాడు. ఓట్ల కోసం ఆడే ఒక నాటకంగానే దీనిని గ్రహించాలి. ఎన్నికలలో ఏదోవిధంగా గెలవాలనే తప్పుడు పద్ధతులలో ఇది ఒకటి.

**మన ప్రభుత్వాల నాటకాలు :**

ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వచ్చిన తర్వాత వింత పరిణామాలు జరుగు తున్నాయి. ముఖ్యమంత్రి శ్రీ జగన్‌మోహనరెడ్డిగారు ఇది చాలా చిన్న జబ్బు, వస్తే పారాసెటమాల్ వేసుకొని, సోడియం హైపో క్లోరైడ్ చల్లితే సరిపోతుంది, ఎక్కువగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని టీ.వి.లలో, పత్రికలలో ప్రకటన చేసారు. ఈయన కూడా ట్రంప్ లాగా మాస్కు పెట్టుకోవడం మనం చూడలేదు. మొదట్లో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఈ జబ్బును తక్కువగా చూపించి రాష్ట్ర ఎన్నికల కమీషనర్ ఎన్నికలను పోస్ట్‌పోన్ చేయడాన్ని పెద్ద రాజకీయ రాద్ధాంతం చేసారు. మరలా ఇపుడు (అక్టోబరు 28న) దేశంలో కేంద్ర ఎన్నికల కమీషనర్ ఆధ్వర్యంలో బీహార్‌లోనూ, ఇతర రాష్ట్రాలలో 50 దాకా అసెంబ్లీ స్థానాల్లోను ఎన్నికలు జరుపుతున్నారు. ఈ పరిస్థితులలో మన స్థానిక సంస్థల ఎన్నికలు జరపడానికి వివిధ రాజకీయ పార్టీలను పిలిచి ఎన్నికలు జరపడంలో మీ అభిప్రాయాన్ని చెప్పమని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ అడిగారు. అధికారంలో ఉన్న వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఈ మీటింగ్‌ను బహిష్కరించింది. ఇపుడు దేశమంతా కేసులు తగ్గిన మాట వాస్తవం. ప్రతిరోజూ 10 వేల కేసుల నుంచి 3 వేల వరకు తగ్గాయి. కోవిడ్ హాస్పిటల్స్‌లో బెడ్లు కూడా చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. నవంబర్, డిసెంబర్‌లలో రెండవ వేవ్ వస్తుంది; పోలీస్, రెవిన్యూ శాఖలలో ఎక్కువ మందికి కరోనా వచ్చిందని, అందువల్ల ఎన్నికలు జరపడం వీలుకాదని ప్రభుత్వం ప్రకటించింది. కేసులు పెరుగు తున్నాయని చెప్పి స్థానిక సంస్థల ఎన్నికలు పోస్ట్‌పోన్ చేయమంటున్నది. మన రాష్ట్రంలో నవంబరు 2వ తేదీ నుండి స్కూళ్లు, కాలేజీలు పనిచేయడం ప్రారంభించాలని ప్రభుత్వ ఆదేశం. రాష్ట్రంలో అనేక ప్రభుత్వ ముఖ్య కార్యక్రమాలు, అధికార పార్టీ వివిధ కార్యక్రమాలలో వేలాది మంది హాజరవటం చూస్తుంటే మరల కరోనా కేసుల సంఖ్య విపరీతంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి.

దేశంలో బీహార్ మరియు వివిధ రాష్ట్రాలలో ఎన్నికలు జరుగుతున్నాయి. తెలంగాణా రాష్ట్రంలో దుబ్బాక ఎన్నికలో లక్షలమందితో బహిరంగసభలు – వూరేగింపులు జరుపుతూ హడావుడి ఎంత కోలాహలంగా వుందో చూస్తున్నాము. పై పద్ధతుల వల్ల కోవిడ్ వ్యాధి ప్రబలుతుంది. ప్రభుత్వం కాని, ప్రతిపక్షాలుగా ఉన్న పాలకపార్టీలు గాని పైకి ఏమి చెప్పినా ఈ విషయాలన్నీ అందరూ కలిసి ఆడుతున్న నాటకంలో భాగమే.

మొదటి దశలోనే కోవిడ్ 19 వ్యాధి ఎట్లా మొదలయింది అనే విషయంలో చైనా, అమెరికాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఇది చైనాలోని వ్యూహాన్ వైరల్ ల్యాబ్ నుంచి చైనా బయటపెట్టి అన్నా ఉండాలి లేదా accidentalగా బయటపడి ఉండాలని అమెరికా ఆరోపణ. ఈ జబ్బు మొదలయి వేల సంఖ్యలో కేసులు నమోదయిన తర్వాత కూడా W.H.Oకు, ప్రపంచానికి చైనా తెలియజెప్పలేదని అమెరికా ఆరోపణ. 300 మందికి పైగా అమెరికా సైనికులు, అధికారులు వ్యూహాన్‌కు 3 వారాల క్రితం వచ్చి వెళ్లిన తర్వాతే ఈ జబ్బు ప్రబలిందనే చైనా వాదన. అమెరికా బయోలాజికల్ వార్‌లో భాగంగా ఈ జబ్బును వదిలివెళ్లాడనేది చైనా వాదన. పెట్టుబడి – పంపిణీ వ్యవస్థలో చైనా ఆధిపత్యాన్ని దెబ్బ తీయడానికి అమెరికా ఎత్తుగడగా ఈ బయో లాజికల్ వార్ (వైరస్)ను ఉపయోగించారనేది వాదన. వియత్నాం యుద్ధంలో బయోలాజికల్ వార్‌ను ప్రయోగించిన అనుభవం అమెరికాకు ఉంది. అదే దారిలో చైనా ఆర్థిక – రాజకీయ వ్యవస్థను నాశనం చేయడానికి అమెరికా చేసిన ప్రయోగంగా ఉంది. ఈ వరసలో యూరప్ దేశాలన్నీ ఆర్థికంగాను, ప్రజారోగ్యం దృష్ట్యా కోలుకోలేనంత దెబ్బతిన్నాయి.

★ ★ ★